


# అమ్మమ్మగారి ఊరు

రోహిణి చింతా, హైదరాబాద్
సెల్:9553121430



నా చిన్ననాటి అనుభూతుల్లో అత్యంత ప్రియమైనది వేసవి సెలవుల్లో మా అమ్మమ్మగారి ఊరు వెళ్ళటం.

మా అమ్మమ్మగారి ఊరు తూర్పుగోదావరి జిల్లాలో రావులపాలెం పక్కన ఉన్న పొడగట్లపల్లి అనే అగ్రహారం. నేను ప్రతిఏడూ వేసవి సెలవుల్లో మా అమ్మమ్మగారి ఊరు వెళ్ళేదాన్ని. మా తాతయ్య కొంపెల్ల శ్రీరామమూర్తిగారు ఆ ఊరి పాఠశాల హెడ్‌మాస్టారు. మా అమ్మమ్మ కొంపెల్ల రాజరాజేశ్వరి (పెద్దమ్మాయిగారు) ఊరిలో అందరితోనూ కలుపుగోలుగా ఉండేది.

అప్పట్లో మేము కాకినాడలో ఉండేవాళ్ళం. మా అమ్మమ్మగారి ఊరు పొడగట్లపల్లి వెళ్ళడానికి ఒకే ఒక ఆల్‌రౌండర్ బస్ ఉండేది. మా తాతయ్య కాకినాడ వచ్చి నన్నూ, మా మామయ్య పిల్లల్ని ఆ ఆల్‌రౌండర్ బస్ ఎక్కించి ఆ ఊరు తీసుకువెళ్ళేవాడు. మధ్య మధ్యలో మాకు ప్రయాణబడలిక తెలియకుండా రోలాకోలాలూ, ఇడ్లీ, జామపళ్ళు కొనిపెట్టేవాడు. తెల్లవారుజామున ఎక్కితే ఆ బస్ ఎక్కడెక్కడో తిరిగి సాయంత్రానికి మా ఊరు చేరేది. అంత ప్రయాణం చేసినా, ఆ ఊరు చేరేసరికి మాకు ఉత్సాహమే తప్ప అలసట ఉండేది కాదు.

బస్ దిగుతూనే ఆప్యాయంగా పలకరించే గుఱ్ఱబ్బండి అబ్బాయి, మా కోసం ఆత్రుతగా ఎదురుచూసే మా పక్కవాటా ఆచార్యులగారి అబ్బాయిలు, మా ఊరంతా బిచ్చమెత్తుకునే మా సీతారాముడుగారూ అందరూ నాకు జ్ఞాపకమే.

బస్‌దిగి నాలుగడుగులు వేసేసరికి మా ఊరి చెరువు. చెరువుచుట్టూ నాలుగు వైపులా పెద్ద పెద్ద పావంచాలు. పావంచాల మధ్యలో ఒక చిన్న హనుమంతులవారి గుడి. గుడి ఎదురుగుండా మధ్య వీధి. మధ్య వీధిలో కుడిపక్కన మూడో ఇల్లు మా అమ్మమ్మగారిది. ఎదురుగుండా కరణంగారి ఇల్లు. మాది పెద్ద పెంకుటిల్లు, అంతకంటే పెద్ద వసారా, దొడ్డి, దొడ్లో బావి, బావి చుట్టూ పూల పళ్ళ మొక్కలతో మా అమ్మమ్మగారి ఇల్లు కళకళ్ళాడేది.

రాత్రిళ్ళు మా అమ్మమ్మ చేసిన ఆలుగడ్డ వేపుడూ, వేడిచారూ వేసుకుని చక్కగా మా తులసికోట చుట్టూ కూచుని భోజనం చేసేవాళ్ళం. తరువాత అక్కడే మడత మంచం వేసుకుని, ఆకాశంలో నక్షత్రాలు, మధ్యమధ్యన మిణుగురు పురుగులూ చూస్తూ తాతయ్య చెప్పే కథలు వింటూ పడుకునేవాళ్ళం.

మా వీధి చివర వేద పాఠశాల, అది దాటాక మా తాతయ్య కొబ్బరితోట, అందులో అప్పటికప్పుడు కొట్టిచ్చుకు తాగే కొబ్బరిబొండాలూ, సాయంత్రం ఇంటిలో చెక్కి ఉంచే ముంజ కాయలూ, కాల్చిన తేగలూ, సూరమ్మగారి చేతి మిఠాయిలూ, చాకలి వెంకమ్మ కేకలూ, బుల్లెంకమ్మ నవ్వులూ, సూరమ్మ మనవలూ, ఇలా ఎన్నో విషయాలతో మా రోజు నిండిపోయేది.

వేద పాఠశాల విద్యార్థులు సత్రానికి భోజనానికి వెళ్ళే వేళదాకా మా అమ్మమ్మ మడిగా పూజ చేసుకోవడం, మేము స్నానం చేసి మా అమ్మమ్మ పూజకి పూలు కోయడం, తరువాత ఆచార్యులగారి పిల్లలతో కలిసి గోదావరికి వెళ్ళి పడవలెక్కి లంకలకెళ్ళి ఆడుకోవడం ఇలా ఎన్నో చేసేవాళ్ళం.

మా సత్రం పక్కనే ప్రశాంతమైన రాములవారి గుడి ఉంది. గుడి దాటితే ఆదివారం సంత. సంతలో అవసరం ఉన్నా లేకున్నా ఏదో ఒకటి కొనుక్కోవడం భలే గమ్మత్తుగా ఉండేది. పండగల్లో రాత్రంతా గుడిలో వేసే నాటకాలు మా అమ్మమ్మతో కలిసి చూడడం మరో అనుభూతి. మొట్టమొదటిసారిగా రాత్రంతా సాగే హరిశ్చంద్ర నాటకం నేను మా ఊరిలోనే చూశాను. తెర కట్టి ఆడించే సినిమాకూడా అదే చూడటం. తెరకి రెండుపక్కలా బొమ్మరావడం అనేది నాకు మహా వింతగా ఉండేది.

ఆ నాటకాలూ, గోదావరి లంకలూ, మా అమ్మమ్మ మడి, ప్రేమ మా తాతయ్య కథలు, మా తులసికోట, మా వేదపాఠశాలలూ, మా ఆచార్యులగారి పిల్లలూ, ఇవన్నీ తలుచుకున్నప్పుడల్లా నేను గొప్ప ఆనందం పొందుతాను. ❖